క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాజారామ్, రామధర్మజ తదితరులు

మాడుగుల: పట్టణంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, పార్టీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ సోమవారం ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు దేవరాపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కుక్కర మహేశ్వరి, పాలిమేర విజయలక్ష్మి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు పెరుమళ్ల వెంకటరావు, గొల్లవిల్లి రాజేష్, నాయకులు వేమన గణేష్, నూతిగట్టు నాగశంకర్, జవ్వాది వరహాలు, బసవా రామ పరమేష్, పడాల అప్పలనాయుడు, పాలిమేర చిన్నారావు, సయ్యపురెడ్డి సత్తిబాబు, కోట్యాడ భాస్కర్, కుక్కర శ్రీధర్ పాల్గొన్నారు.

వారపు సంతపై ఎండ ప్రభావం


కొనుగోలుదారుల కోసం ఎదురు చూస్తున్న గిరిరైతులు

మాడుగుల: స్థానిక వారపు సంతపై ఎండ ప్రభావం చూపింది. కొన్ని రోజులుగా తీవ్రంగా కాస్తున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు వారపు సంతకు కొనుగోలుదారులు రాక చింతపండు అమ్ముడుపోలేదు. 50 కిలోల కావిడి చింతపండు గత వారం రూ.1,600 ఉండగా, ఈ వారం రూ.800కు పడిపోయింది. ఇంతవరకు ఉదయం 10 గంటలకే చింతపండు అమ్ముడుపోయేది. కొందరు గిరి రైతులు చింతపండు అమ్ముడుపోక తిరిగి స్వగ్రామాలకు తీసుకుపోయారు. 20 కిలోమీటర్ల దూరం నుంచి సంతకు వచ్చినా ఖర్చులు రాలేదని వాపోయారు.

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు


మస్టర్లను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: ఉపాధి పనుల్లో బోగస్ మస్టరు వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.చంద్రరావు ఉపాధి సిబ్బందిని హెచ్చరించారు. శెట్టిపాలెం, భీమబోయినపాలెం గ్రామా ల్లో ఉపాధి పనులను ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను పరిశీలించి సిబ్బంది, కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు తప్పనిసరి గా ఏర్పాటు చేయాలన్నారు. పనులకు రాకుండా మస్టర్లు వేస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు.

అనాథలకు ఆహార పొట్లాల పంపిణీ


రోడ్డుపై అనాథలకు భోజనం ప్యాకెట్లు అందిస్తున్న సభ్యులు

రావికమతం: కొత్తకోట గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్ ఫర్ పూర్ పీపుల్ సంస్థ సభ్యులు సోమవారం ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకూ రోడ్డుపై అనాథలకు, వృద్ధులకు, మతిస్థిమితం లేని అభాగ్యులకు దారిపొడవునా వీటిని అందించారు. పలు గ్రామాల్లో కుటుంబీకులు దూరమైన అభాగ్యులకు భోజనంతోపాటు దుప్పట్లు, రగ్గులు అందజేశారు. ఆ సంస్థ నిర్వాహకులు విరోతి ఆనంద్, కె.శ్రీనివాసరావు, జె.రాజా, గట్రెడ్డి నాగేశ్వరరావు, మరో పది మంది సభ్యులు నాలుగు నెలలుగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపడుతూ పలువురి మన్ననలు పొందుతున్నారు.

నేత్ర శస్త్రచికిత్సలకు 14 మంది ఎంపిక

కె.కోటపాడు: చౌడువాడలో శంకర్ ఫౌండేషన్ సిబ్బంది ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. 89 మందికి ఆప్తాలమిస్టు చందన కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 14 మందిని ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించనట్టు ఆమె తెలిపారు.

అయ్యన్న గెలిస్తే కుటుంబ పెత్తనమే..

- నేను గెలిస్తే స్వేచ్ఛగా పాలన
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


ప్రచారంలో పాల్గొన్న మహిళలు, కార్యకర్తలు, ప్రజలు


హోటల్ యజమానితో కలిసి పూరీ వేస్తున్న ఎమ్మెల్యే గణేష్


ఎమ్మెల్యే గణేష్‌కు హారతులు పడుతున్న మహిళలు

నర్సీపట్నం: తాను గెలిస్తే ఒక్కడినే ఎమ్మెల్యేను.. అయ్యన్నపాత్రుడు గెలిస్తే ఇంట్లో నలుగురు పెత్తనం చెలాయిస్తారని, ఎవరి కావాలో ప్రజలు ఆలోచన చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని 22వ వార్డు వెంకునాయుడుపేటలో మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి ఆయన సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాల్లో తమ కుటుంబ సభ్యుల జోక్యం ఉండదన్నారు. అయ్యన్నపాత్రుడు గెలిస్తే ఆయన సతీమణి పద్మావతి, పెద్ద కుమారుడు పాత్రుడు, చిన్న కుమారుడు రాజేష్ అధికారం చెలాయిస్తారన్నారు. నియోజకవర్గాన్ని పెద్ద కొడుకు సర్వనాశనం చేస్తాడన్నారు. తనను గెలిపిస్తే ఎవరికీ ఏ అవసరమొచ్చినా నేరుగా తనను కలవచ్చన్నారు. అదే అయ్యన్నపాత్రుడు గెలిస్తే భార్య, ఇద్దరు కుమారులను ప్రసన్నం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని విమర్శించారు. తన భార్య, పిల్లలు ఎవరూ రాజకీయాల్లో జోక్యం చేసుకోరన్నారు. ఒకరిని గెలిపించుకుంటారా.. నలుగురు ఎమ్మెల్యేలుగా పెత్తనం చెలాయించే అయ్యన్నపాత్రుడిని గెలిపించుకుంటారో ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు. అయ్యన్న కొడుకు విజయ్ లేటరైట్ లీజ్‌దారులకు గన్ గురి పెట్టి రూ.20 కోట్లు లాకున్నాడని ఆరోపించారు. దోపిడీలు గురించి వారు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మళ్లీ అయ్యన్నపాత్రుడికి అవకాశం ఇస్తే కొడుకు రౌడీయిజం, దోపిడీలు పెచ్చుమీరుతాయన్నారు. గ్రావెల్, మట్టి తవ్వకాలు, లేటరైట్, రంగురాళ్ల దోపిడీ, ప్రకృతి సంపదను దోచుకున్న చరిత్ర వారిదేనన్నారు. తొలుత ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే గణేష్‌కు వార్డు ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా మహిళలు హారతులు పట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రం అందజేసి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. చిన్న హోటల్ యజమాని పూరీలు వేస్తుండగా ఎమ్మెల్యే సాయం చేస్తూ ఓటు అభ్యర్థించారు. చేనేత కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, డాక్టర్ లక్ష్మీకాంత్, వార్డు ఇన్‌చార్జులు పెట్ల అప్పలనాయుడు, కర్రి రామ్‌గోపాల్, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు కర్రి కనక మహాలక్ష్మి, కర్రి శ్రీనివాసరావు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీడీసీ చైర్మన్‌కు ఎంపీ అభ్యర్థి బూడి పరామర్శ


జ్యోతి చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పిస్తున్న బూడి

చీడికాడ: సి.డి.సి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు సతీమణి దివంగత జ్యోతి చిత్రపటం వద్ద డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ ఘన నివాళులర్పించారు. శ్రీనివాసరావు సతీమణి జ్యోతి ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ మేరకు సోమవారం ఖండివరంలో వారి స్వగృహం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న బూడి శ్రీనును ఓదార్చి అండగా ఉంటామన్నారు. కో–ఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జి మోసూరి సన్నిబాబు, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, ఎంపీపీ కురచా జయమ్మ, నాయకుడు షేకు సూర్యనారాయణ పాల్గొన్నారు.

బైక్ ర్యాలీగా వెళ్లిన పార్టీ శ్రేణులు

మాకవరపాలెం: నాతవరంలో ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి మండలం నుంచి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీగా వెళ్లాయి. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్‌లపై బయలుదేరారు. నాయకులు పెట్ల భద్రాచలం, చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి బొడ్డు గోవింద, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, తదితరులు వెళ్లినవారులో ఉన్నారు.

అగ్ని ప్రమాద నివారణపై అవగాహన


అగ్నిప్రమాద నివారణ ప్రదర్శన చేస్తున్న సిబ్బంది


మాడుగులలో కర్ర పత్రాలను అందజేస్తున్న అగ్నిమాపక సిబ్బంది


తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చోడవరం రూరల్: ప్రతి ఒక్కరూ ప్రమాద నివారణ పరికరాల వాడకం పట్ల అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక దళ అధికారి బి.వి.రామస్వామి సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో సిబ్బందికి ప్రమాద నివారణ చర్యలను ప్రదర్శించి చూపారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ మాట్లాడుతూ అనుకోని విపత్తు సంభవిస్తే ఆదుర్దా పడకుండా ప్రమాద నివారణ పరికరాలను వాడి దాని తీవ్రత పెరగకుండా చూడాలన్నారు. స్మార్ట్ పాయింట్ సిబ్బంది, ఇన్‌చార్జులు ఎస్.హెచ్.సి.ప్రసాద్, సి.మల్లునాయుడు, శేఖర్‌నగేష్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: అగ్నిమాపక వారోత్సవాలు పురస్కరించుకుని అగ్ని ప్రమాదాల నివారణ, జాగ్రత్తల గురించి స్థానిక బస్టాండు ఆవరణలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక అధికారి వి.రాజేశ్వరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు మంటలను ఏవిధంగా అదుపు చేయాలనే దానిపై ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి వివరించారు. అగ్ని ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆస్తి, ప్రాణ నష్టం ఉండదన్నారు. అనంతరం ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

మాడుగులలో అగ్ని ప్రమాదం


బీడు భూముల్లో మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

మాడుగుల రూరల్: స్థానిక ప్రధాన రహదారి నుంచి విద్యుత్ ఉప కేంద్రం వరకు బీడు భూముల్లో తాటిచెట్లు, తుప్పలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు తాగిపారేసిన సిగరెట్టు పీక వల్ల ఈ ప్రమాదం సంభవించింది. సోమవారం స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక కేంద్రం దళాధికారి వి. రాజేశ్వరావు, సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పి వేశారు.

నేడు చిన భీమవరంలో పార్టీ సమీక్షా సమావేశం

బుచ్చెయ్యపేట: చిన భీమవరం పడమటమ్మ ఆలయం వద్ద మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, మండల ఇన్‌చార్జి గేదెల శేషు తెలిపారు. 35 పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆపరేటివ్ అధ్యక్షులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

మూకుమ్మడిగా గ్రామ వలంటీర్ల రాజీనామాలు


పంచాయతీ సెక్రటరీకి రాజీనామా పత్రాలను అందిస్తున్న తెనుగుపూడి వలంటీర్లు


పంచాయతీ సెక్రటరీకి రాజీనామా పత్రాలను అందిస్తున్న సీతంపేట వలంటీర్లు


రాజీనామా లేఖలు చూపుతున్న చీమలపాడు వలంటీర్లు


రాజీనామా పత్రాలను ఎంపీడీవో సిబ్బందికి అందిస్తున్న రాజాం వలంటీర్లు

దేవరాపల్లి: ప్రతిపక్షాల కక్షపూరిత వేధింపుల నేపథ్యంలో రెండు గ్రామాల వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. తెనుగుపూడిలో 14 మంది వలంటీర్లు పంచాయతీ సెక్రటరీ జి. సంతోషి నళినికి, నాగయ్యపేట సచివాలయం పరిధి సీతంపేటలో ఐదుగురు వలంటీర్లు పంచాయతీ సెక్రటరీ ఎస్.కె. అబ్దుల్ రెహ్మాన్‌కు రాజీనామా పత్రాలను సోమవారం అందజేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ సహా ఆ పార్టీల నేతలు విమర్శించడంతో మనస్తాపంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

రాజాం నుంచి..

బుచ్చెయ్యపేట: రాజాం గ్రామానికి చెందిన వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. సోమవారం సాయంత్రం రాజీనామా పత్రాలను ఎంపీడీవో వెంకటాచార్యకు అందజేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలతో మనస్తాపం చెంది రాజీమానా చేశామన్నారు.

చీమలపాడులో

రావికమతం: చీమలపాడు పంచాయతీ నుంచి 13 మంది వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారి రాజీనామా లేఖలను ఎంపీడీవో భానోజీరావుకు అందజేశారు. ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించుకుంటామని ముక్తకంఠంతో తెలిపారు.

ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ
- గుల్లేపల్లిలో ఎన్నికల ప్రచారానికి స్పందన


గుల్లేపల్లిలో ఉపాధి వేతనదారులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ


సీఎం జగన్ అందిస్తున్న సహకారాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

కె.కోటపాడు: ప్రజలకు నిస్వార్థంగా సేవ చేసే అవకాశాన్ని ఓటు ద్వారా తనకు కల్పించాలని మాడుగుల వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. సోమవారం గుల్లేపల్లి, ఎ.కోడూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వీటితోపాటు ఆయా కుటుంబాలకు వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధిని తెలియజేశారు. తన తండ్రి వలే తాను ప్రజలకు అన్ని విధాలుగా అండగా నిలవనున్నట్లు భరోసా ఇచ్చారు. వివక్ష లేకుండా ప్రజలకు మేలు చేసిన సీఎం జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు మరలా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు మరలా దగా హామీలతో ప్రజల్లోకి వస్తున్నారని, ఓటుతో బుద్ధి చెప్పి సీఎం జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు, ఎమ్మెల్యేగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. గుల్లేపల్లిలో ఉపాధి వేతనదారులును కలిసి ఆమె ఓటు వేయాలని కోరారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు, బొడ్డు ప్రకాసి, ఆదిరెడ్డి వెంకటరావు, బొడ్డు శ్రీను, గొర్రుపోటు వెంకటరావు, శ్రీకాంత్ శ్రీను, గేదెల ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాదరణ చూడలేకే జగనన్నపై దాడి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ధర్మశ్రీ సతీమణి విజయలక్ష్మి, జెడ్పీటీసీ రాంబాబు


వడ్డాదిలో ఇంటింటా ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాల నాయకులు దాడులకు దిగడం సిగ్గుచేటని జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పార్టీ మండల నాయకులు, ధర్మశ్రీ సతీమణి విజయలక్ష్మితో కలిసి సోమవారం రాత్రి వారు వడ్డాదిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు ఇళ్లకు వెళ్లగా, జగన్‌బాబుకు ఎలా ఉంది? టీడీపీ నాయకులు రాళ్లతో దాడి చేశారంటా? అంటూ పలువురు పింఛన్‌దార్లు, మహిళలు, తదితరులు ఆతృతగా అడిగి తెలుసుకున్నారు. జగనన్నను గద్దె దించాలని అన్ని పార్టీలు ఏకమై కుతంత్రాలు పన్నినా మీ చల్లని దీవెనలు ఉన్నంత కాలం ఎవరూ ఏమీ చేయలేరని పార్టీ నాయకులు తెలిపారు. సంక్షేమ పథకాలు ఎప్పటిలాగే అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని, ఎంపీగా బూడి ముత్యాలనాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, ఎంపీటీసీలు ఇంటి అప్పారావు, కోరుకొండ లీలావతి రమణ, వార్డు మెంబర్లు మురళి, బొబ్బరి ఈశ్వరరావు, అప్పారావు, మామిడి వెంకటస్వామి, సయ్యపురెడ్డి కొండబాబు, గిరి, నానాజీ పాల్గొన్నారు.

సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణకు శిక్షణ


శిక్షణ తరగతులు పరిశీలిస్తున్న ఆర్వో సత్యవాణి

మాడుగుల: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించడానికే పోలింగ్ అధికారులతోపాటు సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని మాడుగుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి. సత్యవాణి తెలిపారు. సోమవారం స్థానిక బాలుర హైస్కూల్‌లో పీవోలు, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఏడు గదుల్లో 260 మందికి తొలిరోజు శిక్షణ ఇచ్చారు. కె. కోటపాడు తహసీల్దారు జె. ఈశ్వరమ్మ పోస్టల్ బ్యాలెట్లతోపాటు ఫారం –12 తీసుకున్నారు. కార్యక్రమంలో మాడుగుల తహసీల్దార్ సత్యనారాయణ, ఎన్నికల డీటీ రాజా, ఎన్నికల జూనియర్ అసిస్టెంట్ పూర్ణయ్య పాల్గొన్నారు.

24లోగా ఇంటర్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపు

రావికమతం: ఇంటర్ సప్లిమెంటరీ, బెటర్‌మెంట్ పరీక్ష ఫీజు ఈ నెల 18 నుంచి 24వ తేదీ లోగా చెల్లించుకోవాలని కొత్తకోట కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సత్యవతి సోమవారం తెలిపారు. వచ్చే నెలలో ఎన్నికలు ఉన్నందున గడువు పెరిగే అవకాశం లేదన్నారు. ఫెయిలైన వారు ఒక సబ్జెక్ట్ కానీ అంతకన్నా ఎక్కువ ఉంటే ఫస్టియర్ విద్యార్థులు రూ.550, అన్నీ పాసై బెటర్‌మెంట్‌కు వెళ్లేవారు రూ.550కు అదనంగా ఒక్కో సబ్జెక్టుకు రూ.160 చొప్పున చెల్లించాలన్నారు. రెండు సంవత్సరాల సబ్జెక్టులు ఉంటే రూ.1,100, వీటితోపాటు ప్రాక్టికల్స్ ఉంటే రూ.1,350 చెల్లించాలన్నారు.

గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు


తామరం రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మాడుగుల గవరవీధిలో పెళ్లిరాట ఉత్సవంలో భక్తులు


కొత్తకోట శివకేశవ ఆలయంలో పెళ్లిరాట వేస్తున్న దృశ్యం


సీతారాముల కల్యాణానికి సిద్ధమైన ఆలయం

మాకవరపాలెం: శ్రీరామనవమి ఉత్సవాలను గ్రామాల్లో వైభవంగా ప్రారంభించారు. ఈ 17న శ్రీరామనవమి సందర్భంగా వివిధ గ్రామాల్లో రాముడి పెళ్లిరాట మహోత్సవాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం తామరం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాముడి పెళ్లిరాట వేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి పెళ్లిరాట

రావికమతం: శ్రీరామనవమి సందర్భంగా సీతారామ కల్యాణ మహోత్సవానికిగానూ కొత్తకోట శివకేశవ ఆలయంలో సోమవారం పెళ్లిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శివకేశవ ఆలయంలో పెంటపాటి రాము దంపతులు, రామకోవెలలో గుమ్ము డు చినబాబు దంపతులతో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రోలుగుంట: స్థానిక పాత రామ మందిరం వద్ద జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ ఆధ్వర్యంలో ఆల య ధర్మకర్త లక్ష్మీశ్రీనివాస్, కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి శ్రీరామ నవమహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మాట్లాడుతూ ఇక్కడ ఆలయం 1890లో భద్రాది మాదిరిగానే ఏకశిలపై నిర్మించారన్నారు. అప్పటి నుంచి ఏటా అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 17న వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అదేరోజు మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామన్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్: స్థానిక గవరవీధిలో వైభోగ సీతారాముల ఆలయంలో పెళ్లిరాట మహోత్సవం నిర్వహించారు. ఎంపీటీసీ పాలిమేర విజయలక్ష్మి దంపతులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఇక్కడ ఏక శిలా ధ్వజస్తంభం ఏర్పాటు చేయడం విశేషం. ఈ కార్యక్రమం కె.జె.పురం, వంటర్లపాలెం, ముకుందపురం, వీరవల్లి అగ్రహారం, పెంటయ్యపాలెం, జి.అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు, గాదిరాయి, ఎం. కోటపాడు, తదితర గ్రామాల్లో నిర్వహించారు.

ఆరిలోవ రోడ్డు రెండో దశ పనులు ప్రారంభం

గొలుగొండ: ఆరిలోవ అటవీ ప్రాంతంలో రెండో దశ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడ 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ చేయకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దృష్ట్యా నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఈ రోడ్డు విస్తరణకు కావాల్సిన అనుమతులు తీసుకురాగా, మూడు నెలల క్రితం మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం తారు వేసే పనులు ప్రారంభం కావడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పనులకు రూ.4 కోట్లు ఖర్చు కాగా ఎన్నోయేళ్ల నుంచి ఏ నాయకుడు పట్టించుకోలేదని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు చేయడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పనులు జరుగుతున్న దృశ్యం